క్లుప్తంగా

చెస్ క్రీడాకారిణి గోలి సంధ్యకు ఆహ్వానం



విజయవాడలో సంధ్యను ఆహ్వానిస్తున్న మండపేట బీజేపీ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): విజయవాడకు చెందిన చెస్ క్రీడాకారిణి, కోచ్ గోలి సంధ్యను ద్వారపూడిలో ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి ఆహ్వానించినట్టు బీజేపీ మండపేట నియోజకవర్గ కో కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ద్వారపూడిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌కు హాజరై విద్యార్థులను చైతన్యపర్చాలని కోరామన్నారు. ఇటీవల విజయవాడ వెళ్లి సంధ్యకు ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్టు మురళీకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరు గ్రామంలోని శ్రీసత్యభాస్కర మండల ప్రజా పరిషత్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం స్కూల్ కిట్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలోని 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ పేరుతో విద్యార్థులకు యూనిఫాం, బెల్ట్, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షహజాదే ఖాసింకు ఘన నివాళి



ద్రాక్షారామ వీధుల్లో గుర్రంపై పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో ఏడో రోజును ద్రాక్షారామలోని ముస్లింలు బుధవారం నిండు శోకంతో నిర్వహించుకున్నారు. ఇస్లాం వ్యవస్థాపకుడు మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ పరివారానికి ప్రార్థనలు చేస్తూ మాతం చేశారు. మధ్యాహ్నం బీబీ సకీనా పంజాలో మజ్లిస్‌ల అనంతరం నక్షా, బీబీ షకీనా, షహజాదే ఖాసిం పంజాల నుంచి పీర్లను గుర్రాలపై ఊరేగించారు. మాతం చేస్తూ ఆగావారి వీధిలోని ఆగావారి పంజా చేరుకుని ఇమాం హుస్సేన్ తనయుడు షహజాదే ఖాసింకు ఘనంగా నివాళి అర్పించారు. పీర్లను ఊరేగిస్తున్న సమయంలో మహిళలు, పురుషులు షహజాదే ఖాసింను తలచుకుని విలపించారు. లక్నో నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా మొహమ్మద్ షంసీ సాహెబ్ మొహర్రం ఏడో రోజు ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ద్రాక్షారామతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



మడికిలో కొబ్బరిచెట్టు పడి విరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరిస్తున్న విద్యుత్ శాఖ

ఆలమూరు: మండలంలోని మడికిలో కొబ్బరి చెట్టు పడి విద్యుత్ తీగలు తెగిన సంఘటనలో ఇద్దరికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం స్థానిక 216 ఏ జాతీయ రహదారి నుంచి కడియం మండలంలోని దుళ్ల వెళ్లే రోడ్డులో 11 కేవీ విద్యుత్ తీగలపై కొబ్బరిచెట్టు విరిగి పడిపోయింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో పాటు తీగలు చెల్లాచెదురై రోడ్డుపై పడ్డాయి. అదే సమయంలో ఆ ప్రదేశంలో బైక్ పక్కన నిలబడి ఉన్న ఇద్దరు యువకులు కొబ్బరి చెట్టు విరిగి పడుతున్న శబ్దాన్ని గ్రహించి వెనువెంటనే పక్కకు పరుగులు తీసి ప్రాణాలను దక్కించుకున్నారు. అలాగే అదే రోడ్డులో చిన్నారిని ఎత్తుకుని ఉన్న మహిళ కూడా ఈ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సంఘటన వివరాలను తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికపై స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను యథావిధిగా అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అంతా బురదమయం

- ఇసుక అక్రమ రవాణాతో ఛిద్రమైన గోదారిగట్టు
- జారిపడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



కపిలేశ్వరపురం వద్ద బురదమయంగా మారిన గోదారిగట్టు

కపిలేశ్వరపురం: గోదావరి నదీ గర్భాన్ని అక్రమాలకు నిలయంగా కూటమి నేతలు మార్చేశారు. పుష్కరాల సమయంలో దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చి పుణ్య స్నానం చేసే గోదావరి రేవులు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఇసుక అక్రమాలను చూసి అవాక్కవుతున్నాయి. రాత్రింబవళ్లు భారీ వాహనాలతో నిబంధనలను తుంగలోకి తొక్కి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో అక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు కనీస పర్యవేక్షణ కూడా చేయని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు సైతం అడపా తడపా తనిఖీలు చేసి నామ మాత్రపు హెచ్చరికలతో సరిపెడుతున్నారు. పేరుకు తనిఖీలే కానీ వారు అక్రమాల పుట్టను కదిలించడం లేదు.

అధికారుల తనిఖీలు

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల జూన్ 30న మండలంలోని కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపులను తనిఖీ చేశారు. అప్పటి వరకూ యథేచ్ఛగా అక్రమాలు చేసిన కూటమి అనుచరులు అనధికారిక రికార్డులను దాచి జాగ్రత్తపడ్డారు. ఉన్నతాధికారులు వస్తున్నప్పుడల్లా జాగ్రత్త పడటం, కొద్ది రోజుల పాటు తవ్వకాలు తరలింపులను నిలిపివేయడం చేస్తున్నారు. తర్వాత షరా మామూలే. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారుల తనిఖీలతో వరిగిందేమీ లేదంటూ సామాన్య ప్రజలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇసుక అక్రమాల దాహం నేపథ్యంలో రహదారులు ఛిద్రమవుతున్నాయి. పేరుకు ఉచితమని చెబుతున్న ఇసుక భారీ ధరలకే విక్రయిస్తుండటం కూటమి నేతలకే చెల్లింది.

కపిలేశ్వరపురం నుంచి జొన్నాడ వరకూ...

కపిలేశ్వరపురం నుంచి ఆలమూరు మండలం జొన్నాడ వరకూ పలు చోట్ల గోదారి గట్టు ఛిద్రమైంది. మరీ ముఖ్యంగా కపిలేశ్వరపురం వద్ద గోదారి గట్టు బురదమయంగా మారింది. ఇసుక లారీల నుంచి వారుతున్న నీరు, తరచూ కురుస్తున్న వర్షపునీటికి రహదారి చిత్తడి అవుతోంది. కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల నుంచి ఇసుకను తరలించే భారీ వాహనాలతో రూ.కోట్లతో నిర్మించిన రహదారులు ఛిద్రమవుతున్నాయి. చిన్న గుంతలుగా ఉన్నప్పుడే వాటిని పూడ్చితే సమస్య పరిష్కారమయ్యేది. సహజ వనరైన ఇసుకను అక్రమమార్గాల్లో విక్రయించుకోవాలన్న తపన తప్ప విలువైన రహదారులను కాపాడలన్న తపన కూటమి ప్రభుత్వాధినేతలకు లేదు.

గ్రామస్తుల నిరసన

రహదారులు అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో జూన్ 16న కపిలేశ్వరపురంలో గ్రామస్తులు వాహనాలను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. గోదారిగట్టును సర్వ నాశనం చేసేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాల తాకిడికి రేగుతున్న దుమ్ముతో గట్టు చెంత ఉన్న తామంతా తీవ్ర అవస్థలు పడుతున్నామంటూ స్థానిక నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వాహనాలతో రహదారి గుంతలు పడి ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారని, మీకు ఇసుక తప్ప రహదారులు పట్టవా అంటూ ర్యాంపు నిర్వాహక ప్రతినిధులను నిలదీశారు. దీంతో మరమ్మతు చేయిస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. తీరా 15 రోజులు గడిచినా పరిస్థితి షరా మామూలే. ప్రస్తుతం రహదారి ఛిద్రమై ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కపిలేశ్వరపురం వద్ద చిత్తడిగా మారిన గోదారిగట్టు మార్జిన్



వర్షపునీరు నిలిచిన రహదారిపై వాహనాల రాకపోకలు



కపిలేశ్వరపురం గోదారిగట్టుపై వాహనాలను నిలిపి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు (ఫైల్)

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పంపన నాగమణి

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి నివేదికను సభ్యులకు వివరించాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్, వెలుగు, ఎంజీఎన్‌ఆర్‌జీఎస్, వైద్య, విద్య తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదిక చదివి సభలో వినిపించారు. అయితే ఆయా శాఖలకు చెందిన సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. పలువురు ఎంపీటీసీలు సర్పంచ్‌లు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల వద్ద రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ దంగేరు శివారు కూనిమిల్లి పాడులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో పాటు గ్రామానికి కొత్త లైన్ మేన్‌ను నియమించాలని కోరారు. కూళ్ల సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో మాత్రంగా కానరావడం లేదన్నారు. దీంతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది ప్రొటోకాల్ పాటించడం లేదని ప్రజాప్రతినిధులను సమావేశాలకు పిలవడం లేదని విమర్శించారు.

గౌరవ వేతనాలు అందించాలి..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీకు గౌరవ వేతనం సరిగ్గా అందడం లేదని సర్వసభ్య సమావేశానికి ముందు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్‌కు ఎంపీటీసీలు విన్నవించుకున్నారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే అందించే ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో భాగస్వాములై ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ఏదైనా సరే ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి వారితో కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. వరిసాగు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి రైతూ క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



జగన్నాయకులపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మణిదీప్



కూళ్లలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులందరూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ఎకరానికి రూ.76 చెల్లించి పంట ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ సూచించారు. జగన్నాయకులపాలెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆయన పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నారుమడులు నూరు శాతం పూర్తయ్యాయని తెలిపారు. అదే విధంగా ఊడ్పులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ పంట నమోదు రైతు సేవా కేంద్రాల్లో చేయించుకోవాలన్నారు. ఏ పంట రకం వేశారో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌లు మీసేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ఎరువులను రైతులకు అందుబాటులో ఉండే విధంగా సొసైటీల వద్ద ఉంచడం జరుగుతుందన్నారు. అన్నదాతా సుఖీభవకు సంబంధించిన గ్రీవెన్స్ అందుబాటులో ఉందన్నారు. రైతులకు ఏ విధమైన సమస్యలు ఉన్నప్పటికీ రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సీహెచ్ లోవరాజు, వెటర్నరీ అసిస్టెంట్ హరీష్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

కె.గంగవరం: రైతులు తప్పకుండా వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని రామచంద్రపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ అన్నారు. మండలంలోని కూళ్ల, అముజూరు గ్రామాల్లో బుధవారం పొలం పొలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలకరి సాగు ఆలస్యం చేయకుండా రైతులు సాగు పనులను వేగవంతం చేయాలని సూచించారు. వరి నాట్లు బెంగాల్ పద్ధతిలో వేసుకోవాలన్నారు. దమ్ములోనే భాస్వరం, పొటాష్, ఎరువులను ఇన మారులో వేసుకుంటే పైరు ఏపుగా ఎదగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఏఓ సద్గురు మూర్తి మాట్లాడుతూ రైతులందరూ వరి స్వర్ణ రకంతో పాటు ఎంటీయూ–1318 రకం కూడా కొంత మేర వేసుకోవాలని సూచించారు. తద్వారా పంట దిగుబడి ఇస్తూ గాలి, వానలకు త్వరగా పడిపోదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిల్లే నాగేశ్వరరావు, నానాపరపు కళ్యాణి, నీటి సంఘం ఉపాధ్యక్షుడు సుబ్బారావు, ఏఈఓ హేమంత్, రైతులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కల్పించాలి



పెదపళ్ల పీహెచ్‌సీలో డెంగీ వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ



ఈదరాడలో నిర్వహించిన డెంగీపై అవగాహన ర్యాలీ

ఆలమూరు: డెంగీ వ్యాధిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈనెల ఒకటిన ప్రారంభమైన డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు 31 వరకూ జరుగుతాయన్నారు. అలాగే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డెంగీ వ్యాధి సోకకుండా తీసుకోవలలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్, ఏవీవీ రాజా సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ పి.రాజా రమేష్‌కుమార్, ఫార్మసిస్టు డి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరం వస్తే డాక్టర్ని సంప్రదించండి

మామిడికుదురు: హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తే డాక్టర్‌ని సంప్రదించాలని హెల్త్ అసిస్టెంట్ కొమ్మూరి ఉమా మహేశ్వరరావు సూచించారు. ఈదరాడలో బుధవారం డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ సోకిన వారికి కళ్లు కదిలించలేని పరిస్థితి, ఎముకల్లోను, కండరాల్లోనూ భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు, రేస్ వస్తాయన్నారు. డెంగీ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పి.శాంతకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమలాపురం తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



అమలాపురం వెళ్తున్న కపిలేశ్వరపురం మండల నాయకులు, కార్యకర్తలు

కపిలేశ్వరపురం: అమలాపురంలో బుధవారం నిర్వహించిన 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం జిల్లా స్థాయి సన్నాహక సమావేశానికి మండపేట, కపిలేశ్వరపురం మండలాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు సమావేశానికి వెళ్లారు.

మోదీ పాలనలోనే దేశం పురోగతి దిశగా పయనం

కాజులూరు: ప్రధాని నరేంద్రమోదీ పాలనలోనే దేశం పురోగతి దిశగా పయనిస్తోందని మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలన చేపట్టి 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం మండలంలోని చేదువాడ, తిప్పరాజుపాలెం, అయితపూడి తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ సలాది వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మన రాజేష్, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొని ఇంటింటా పర్యటించి బీజేపీ పాలనలో ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు.

కందులపాలెంలో టీబీ ముక్త భారత్ అభియాన్



కందులపాలెంలో టీబీ ముక్త భారత్ అభియాన్ నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెంలో వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి క్షయ వ్యాధి లక్షణాలతో ఇబ్బంది పడుతున్న 23 మందిని గుర్తించి వారి నుంచి కళ్లె సేకరించి పరీక్షలు చేశారు. అనంతరం వారికి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ క్షయ వ్యాధి రహిత భారతదేశం కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైనా మూడు వారాల కంటే ఎక్కువగా కళ్లెతో కూడిన దగ్గు, జ్వరం, ఛాతీ నొప్పితో ఇబ్బందులు పడుతూ ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మందుల ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం టీబీ ముక్త భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలేశు మాట్లాడుతూ రామచంద్రపురం టీయూ పరిధిలో జూన్ నెలలో 5 కొత్త టీబీ కేసులకు చికిత్స ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ భాను బేగం, టీబీ హెచ్‌వీ పావని, సూపర్‌వైజర్లు జి.రత్నం, డి.రాజేశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు విజ్ఞానం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

రామచంద్రపురం: బాలికలు విద్యాభ్యాసం మూలంగా చదువుతో పాటుగా విజ్ఞానం కలుగుతుందని, విజ్ఞానం ద్వారా ఉన్నత శిఖరాలు అందుకోగలుతారని రామచంద్రపురం సీఐ ఎం వెంకటనారాయణ అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ అధ్యక్షతన బుధవారం విద్యార్థులకు సోషల్ మీడియా వలలో పడి జీవితాలు ఏ విధంగా పాడు చేసుకుంటున్నారు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ ఆడపిల్లకు చదువు చాలా అవసరం అన్నారు. చదువుతో లోకజ్ఞానం కలుగుతుందని, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని వాటిని అందిపుచ్చుకోవడానికి శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఫోన్ సరిగ్గా ఉపయోగించకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురి అవుతుంటారన్నారు. సోషల్ మీడియా వాడే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి రోజు పేపర్ చదవడం ద్వారా ప్రపంచ పరిజ్ఞానంతో పాటు, విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఆడపిల్లల మీద చాలా దారుణాలు జరుగుతున్నాయి. ప్రతీ ఆడపిల్ల బయట జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చదువుపై శ్రద్ధ, తల్లిదండ్రులపై గౌరవ భావన కలిగి ఉండాలన్నారు. ఎస్సై ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ గృహ హింస చట్టం, సైబర్ క్రైమ్ కోసం విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



ద్రాక్షారామలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ఆధ్వర్యంలోని డ్వాక్రా సంఘం సభ్యులు

రామచంద్రపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలోని డ్వాక్రా యానిమేటర్ల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ద్రాక్షారామలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, మండల కన్వీనర్ మేడిశెట్టి దుర్గమ్మ, డ్వాక్రా యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎ.జ్యోతి మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఈ నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాలు అమలులోకి వస్తే చట్టాలు వర్తించే కార్మికులు, వర్తించని కార్మికులు కూడా బానిసత్వంలోకి నెట్టబడతారన్నారు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం విద్యుత్, రవాణా, బ్యాంకులు, ఇన్సూరెన్స్, స్టీలు తదితర రంగాల్లోని సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని మండిపడ్డారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డ్వాక్రా యానిమేటర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్టెతస్కోప్ బహూకరణ

సఖినేటిపల్లి: మోరిపోడు సుబ్బమ్మ మిషనరీ ఆసుపత్రి వైద్యురాలు లతా పాల్‌కు బుధవారం మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు హోల్డర్ చొప్పల రాజశేఖర్ అమెరికాకు చెందిన స్టెతస్కోప్‌ను బహూకరించారు. ఈ మేరకు సుబ్బమ్మ మిషనరీ ఆసుపత్రికి వెళ్లిన ఆయన, డాక్టర్‌కు స్టెతస్కోప్ ఇచ్చారు. వెంట తాడి సహదేవ్, నల్లి శివకుమార్, దేవ దయానంద్, రాపాక అజయ్ పాల్గొన్నారు.